క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ గోపాల్

ఆత్మకూరు: వర్షాకాలం ప్రజలు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని బైర్లూటి వైద్యాధికారి గోపాల్ సూచించారు. మండలంలోని అమలాపురం చెంచుగూడెం సోమవారం గిరిజనులకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం పలు చోట్ల దోమలు పెరిగే అవకాశం ఉందని, ఫలితంగా విషజ్వరాలు, డెంగీ, మలేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమలు పెరగకుండా, పాతటైర్లు, కొబ్బరిబోండాలు లాంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లముందు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంతకుమునుపు గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ రవణమ్మ, రజిత, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు సీఐగా నాగభూషణం



ఆత్మకూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐగా నాగభూషణం సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన సీఐ సుబ్రహ్మణ్యం బదిలీపై వైఎస్సార్ జిల్లాకు వెళ్లడంతో ఆయన స్థానంలో అదే జిల్లాలో పని చేస్తున్న నాగభూషణాన్ని నియమించారు. ఆత్మకూరు సీఐ కృష్ణమూర్తి, పాములపాడు ఎస్‌ఐ అశోక్ కుమార్, కొత్తపల్లి ఎస్‌ఐ హుస్సేన్‌బాషా, వెలుగోడు ఎస్‌ఐ జగన్‌మోహన్‌యాదవ్‌లు నూతన సీఐను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సోమవారం ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అన్ని తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యా బోధన ఎలా జరుగుతుంది..? ఉపాధ్యాయులు సక్రమంగా హాజరవుతున్నారా..లేదా..? తదితర విషయాలపై , భోజన సౌకర్యం పై ఆరా తీశారు. 10వ తరగతి పరీక్షల్లో అధిక ఉత్తీర్ణత శాతం సాధించాలని , ఇందుకు విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఆత్మకూరు: బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ఆదిశేషులు విఠల్‌బాబును అతి కిరాతకంగా హత్య చేసినందుకు నిరసనగా ఆత్మకూరు న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశవరెడ్డి, కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ న్యాయవాది హత్యకు నిరసనగా 3 రోజుల పాటు విధులకు బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది గోవింద్‌రెడ్డి, నూర్‌అహ్మద్, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

మిడుతూరు: మండల పరిధిలోని కడుమూరుకు చెందిన చాకలి శ్రీనివాసులు శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద మృతుని భార్య వరలక్ష్మికి రూ. 10 వేలు సర్పంచ్ జీవరత్నం చేతుల మీదుగా సోమవారం అందజేశారు. పీఎస్ శివకళ్యాణ్ సింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్ రహీంబాషా పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

మహానంది: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి సోమవారం తెలిపారు. మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని అధ్యక్షతన బుక్కాపురంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు.

ఆలయాన్ని తొలగించొద్దు

నంద్యాల(అర్బన్): నందికొట్కూరు మండలం 10బొల్లవరం గ్రామంలో 800 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన వేణుగోపాల స్వామి ఆలయాన్ని హైవేలో తొలగించకుండా యథాతథ స్థితిలో ఉంచేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చల్లా దామోదర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు.

ప్రగల్బాల చంద్రబాబు

- ప్రాజెక్టుల వద్ద నిద్రించైనా పోతిరెడ్డిపాడు పెండింగ్ పనులు పూర్తిచేయిస్తానని చంద్రబాబు ప్రగల్బాలు
- టీడీపీ ఐదేళ్ల పాలనాకాలంలో పూర్తిచేయించలేకపోయిన వైనం
- జగనన్న సీఎం అయ్యాక హెడ్‌రెగ్యులేటర్ పనులు పూర్తి
- కాలువకు 44వేల క్యూసెక్కుల నీటి విడుదల
- రూ.1,591.18కోట్లతో కొనసాగుతున్న లైనింగ్ పనులు





2019 ఆగస్టు 16న పోతిరెడ్డిపాడు నుంచి 44వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన దృశ్యం, కొనసాగుతున కాల్వ లైనింగ్ పనులు

జూపాడుబంగ్లా: వ్యవసాయం దండగన్న చంద్రబాబునాయుడు తన ఐదేళ్ల పాలనలో పెండింగ్‌లో ఉన్న 10శాతం పోతిరెడ్డిపాడు పనులు పూర్తి చేయించకపోవడంతో సాగునీరు అందక ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. 2005 మార్చి 13న ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు బానకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌ను సందర్శించారు. ప్రాజెక్టు గట్లపైన నిద్రించైనా వందరోజుల్లోగా పెండింగ్‌లో ఉన్న పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ పనులను పూర్తిచేయించి 44 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తామని ప్రగల్బాలు పలికారు. అయితే ఐదేళ్ల పాలనలో 10 శాతం పనులు పూర్తి చేయలేకపోయారు. అలాంటి ఆయన నేడు ప్రాజెక్టు సందర్శనకు రావడం సిగ్గుచేటని రైతులు విమర్శిస్తున్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక పెండింగ్ పనులు పూర్తి

2005 డిసెంబర్‌లో ప్రారంభించిన నూతన హెడ్‌రెగ్యులేటర్ నిర్మాణ పనులు పూర్తిచేయించటంలో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు ఘోరంగా విఫలం కావటంతో రాయలసీమ ప్రాంతాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీకి కేటాయించిన నీటివాటాను సకాలంలో సద్వినియోగం చేసుకోలేక ఈ ప్రాంతంలో ఉన్న రిజర్వాయర్లను నింపుకోలేని దుస్థితి ఉండేది. 2009లో ముఖ్యమంత్రిగా బాధ్యతలుచేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమ రైతాంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే సంకల్పంతో పెండింగ్‌లో ఉన్న పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ పనులను పూర్తిచేయించారు. 2019 ఆగస్టు 16న హెడ్‌రెగ్యులేటర్ నుంచి 44వేల క్యూసెక్కుల నీటిని విడుదలచేసి రికార్డు సృష్టించారు. నీటిని పోతిరెడ్డిపాడు ద్వారా రిజర్వాయర్‌లకు మళ్లించి ఏపీకి కేటాయించిన నీటి వాటాను సద్వినియోగం చేసుకునేలా చేయగలిగారు. చంద్రబాబు పాలనలో 2004 నుంచి 2009 వరకు సకాలంలో వర్షాభావం లేక పోతిరెడ్డిపాడు నుంచి ఏటా ఆగస్టు మాసంలో నీటిని విడుదల చేసేవారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక 2009 నుంచి సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో ఏటా జూన్, జులై మొదటివారంలోగా పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేస్తున్నారు.

కొనసాగుతున్న కాల్వల లైనింగ్ పనులు

పోతిరెడ్డిపాడు నుంచి 44వేల క్యూసెక్కుల నుంచి 80 వేల క్యూసెక్కుల నీటి విడుదలకు అనుకూలంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రూ.1,591 కోట్లతో ఎస్సార్‌ఎమ్సీ, ఎస్సార్బీసీ కాల్వల లైనింగ్ పనులు చేయిస్తున్నారు. రూ.570.55 కోట్లతో 16.5 కిలో మీటర్లున్న ఎస్సార్‌ఎమ్సీ కాల్వ లైనింగ్, 9 కిలోమీటర్ల మేర ఎస్సార్‌ఎమ్సీ కాల్వ ఎడమగట్టు వెంట రక్షణ గోడ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. రూ.981.93కోట్ల వ్యయంతో ఎస్సార్బీసీ, జీఎన్‌ఎస్‌ఎస్ కాల్వల లైనింగ్ పనులు, రూ.38.70 కోట్ల వ్యయంతో మూడు గేట్లతో బానకచర్ల వద్ద నూతన హెడ్‌రెగ్యులేటర్ నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

సీఎం పదవి పోతుందనే భయంతో పోతిరెడ్డిపాడు సందర్శించని చంద్రబాబు

పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ను సందర్శిస్తే తన ముఖ్యమంత్రి పదవికి గండం ఏర్పడుతుందనే భయంతో 2015 మే 13న పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సందర్శించకుండానే చంద్రబాబునాయుడు వెనుదిరిగారు. మొదట హెడ్‌రెగ్యులేటర్‌ను సందర్శించాలని సంకల్పించడంతో అప్పటి కలెక్టర్, ఎస్పీ హెడ్‌రెగ్యులేటర్ వద్ద హెలిప్యాడ్ నిర్మాణం పనులను పర్యవేక్షించారు. అయితే పదవీ గండం భయంతో చంద్రబాబు పోతిరెడ్డిపాడు సందర్శనను రద్దుచేసుకొని బానకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌ను సందర్శించారు.

నిజం గొంతు నొక్కి ప్రాజెక్ట్ సందర్శనా..?

పగిడ్యాల: వ్యవసాయాన్ని పండుగ చేయాలన్న ఆశయంతో 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృష్ణానదిలోని లో లెవెల్ నీటిని వినియోగించుకోవడానికి జలయజ్ఞంలో భాగంగా ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశారు.సివిల్‌వర్క్స్, ఇంజినీరింగ్ వర్క్స్ కోసం రూ.314 కోట్లు కేటాయించగా మేగా ఇంజినీరింగ్ కంపెనీ పనులుఅప్పట్లో పనులు చేపట్టి 80 శాతం పూర్తి చేసింది. అయితే 2009లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హఠాన్మరణం చెందడంతో పనులకు గ్రహణం పట్టుకుని నిలిచిపోయిన సంగతి తెలిసిందే. రాష్ట్ర విభజన అనంతరం 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ముచ్చుమర్రి ఎత్తిపోతల పనులను 2015లో ప్రాజెక్ట్ అంచనా వ్యయాన్ని పెంచి పనులు పునఃప్రారంభించి 2017 జనవరిలో జాతికి అంకితం చేసింది. అయితే అప్పటి నందికొట్కూరు ఎమ్మెల్యే ఐజయ్య ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం రూపకర్త వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనే నిజాన్ని ఎలుగెత్తి చెప్పగానే సభా ప్రాంగణంలో ఈలలు, కేకలు వినిపించాయి. దీంతో అసహనానికి గురైన అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ సభలో నీకు పాలు లేదని ఎమ్మెల్యేను మాట్లాడనీయకుండా, వేలాది మంది చూస్తుండగానే మైక్ కట్ చేసి అవమానించిన సంగతిని నియోజకవర్గ ప్రజలు నెమరువేసుకుంటున్నారు. అధికారంలో ఉండగా అవమానించి మళ్లీ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ప్రాజెక్ట్ సందర్శనకు ఏ మొహంతో వస్తున్నారని ప్రశ్నిస్తూ ఫేస్‌బుక్, వాట్సాప్,ఇన్‌స్టాగాం తదితర సామాజిక మాధ్యమాల్లో నాటి వీడియోలను ట్రోల్ చేయడం విశేషం.

అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటాం



బాధిత కుటుంబానికి బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగి నష్టపోయిన కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. పాములపాడు మండల పరిధిలోని వేంపెంట గ్రామంలోని బీసీ కాలనీలో నివాసముంటున్న జిల్లెల హుసేన్ ఆలం ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం కాలిపోయింది. అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను అధికారులు వెంటనే మంజూరు చేయాలన్నారు. అలాగే నష్టపరిహారం అందించాలని ఆదేశించారు. తన వంతుగా ఆర్థిక సాయం అందించారు. ఈయన వెంట తహసీల్దార్ రత్నారాధిక, ఎంపీడీఓ గోపికృష్ణ, గ్రామ సర్పంచు మాణిక్యమ్మ, వడ్డేర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామసుబ్బయ్య, వైస్ ఎంపీపీ బండ్లమూరి వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ సభ్యులు ముర్తుజావలి, సింగిల్ విండో చైర్మన్ రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఆత్మకూరు: దేశంలో కార్మికులకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం ఉందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, కార్యదర్శి కేశవరెడ్డి, చేతివృత్తి దారుల సంయుక్త ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రాధాకృష్ణ, ఆత్మకూరు కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని జగద్గురు మఠంలో ఆ సంఘం నంద్యాల జిల్లా ప్రథమ మహాసభను సోమవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 90 సంవత్సరాలుగా దేశంలో పేద ప్రజలు కార్మికులు సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం, గిరిజనులకు అటవీ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని చూడడం సరికాదన్నారు. అంతకుమునుపు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు ధనుంజయుడు, రాముడు, భాస్కర్, చాంద్‌బాషా,లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిధుల మంజూరు

నందికొట్కూరు: సచివాలయాల పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు చర్చించారు. అజెండాను కౌన్సిలరు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన ప్రతి సచివాలయానికి సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున్న మంజూరు చేయడం జరిగిందన్నారు. సచివాలయం నిధులే కాకుండా ప్రభుత్వం పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించిందని చెప్పారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుందన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ ప్రశాంతి, కమిషనర్ కిషోర్, టీపీఓ బాలమద్దయ్య, ఏఈ కృష్ణలత, ఆర్వో విజయలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో సోమవారం రాత్రి స్వామివారి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్త పూజల అనంతరం పల్లకీలో కొలువు చేశారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఊరేగించారు.

గాజులపల్లెలో మౌలాలిస్వామి జార్తలు



మహానంది: కొలిచేవారికి కొంగుబంగారం, మహిమాన్వితుడైన గాజులపల్లె మౌలాలిస్వామి జార్తలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొహర్రం అనంతరం జార్తలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

మౌలాలిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నేడు జీసీ పాలెంలో 'గడప గడపకు మనప్రభుత్వం'

మహానంది: బండిఆత్మకూరు మండలం జీసీ పాలెం గ్రామంలో మంగళవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే కార్యక్రమంలో ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారని చెప్పారు.

మల్లన సన్నిధిలో జెడ్పీ చైర్మన్



ఆలయం ముందు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను సోమవారం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సరస్వతి దంపతులు దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. వీరు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, అందజేసి సత్కరించారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- లింగాపురంలో 'గడప గడపకు మనప్రభుత్వం'
- గ్రామంలో రోడ్ల అభివృద్ధికి ఎమ్మెల్యే హామీ



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: దళారీ వ్యవస్థ, రాజకీయ ప్రమేయం లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా, పేదలు సైతం గౌరవంగా బతికేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారి గడపల వద్దకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం లింగాపురం గ్రామంలో సోమవారం ఉద యం నుంచి రాత్రి వరకు గడప గడపకు మన ప్రభు త్వం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డితో కలిసి వచ్చిన ఆయన ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా సీఎం జగన్ పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఎన్నికష్టాల్లో ఉన్నా పేదలు మాత్రం కష్టపడకూడదనే సంకల్పంతో చెప్పిన ప్రతిహామీని నెరవేరుస్తూ అన్ని రాష్ట్రాలకు ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని కొనియాడారు.

గ్రామంలో రోడ్ల అభివృద్ధికి చర్యలు

లింగాపురం గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో ప్రధాన వీధి, బీసీ, ఎస్సీ, ఇతర కాలనీల్లో రోడ్లు సరిగా లేకపోవడం చూసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వెంటనే స్పందించారు. సంబంధిత శాఖ అధికారులను పిలిచి రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయించాలని ఆదేశించారు. తాను స్వయంగా గ్రావెల్, మట్టిని తరలించేలా చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. మైనార్టీ నాయకుడు ఇస్మాయిల్ భారీ గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. ఎంపీపీ సంజీవరెడ్డి, కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, గ్రామ నేతలు నరెడ్డుల సుబ్బారెడ్డి, ధరణీకుమార్‌రెడ్డి(ధరణీ), నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, నాగార్జునరెడ్డి, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళా రెడ్డి, సర్పంచ్ రాధమ్మ, ఎంపీటీసీలు అర్జున్, రామయ్య, ఉపసర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

నేడు సత్యనారాయణ స్వామి వ్రతం

వెలుగోడు: పట్టణంలోని శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బళ్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు. ఇతర మాసాలలో వచ్చే ఫలితం కన్నా ఈ అధిక మాసంలో చేసే పూజా, వ్రతాలకు అధిక ఫలితం లభిస్తుందని చెప్పారు. భక్తులు ఈ వ్రతంలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలి

నందికొట్కూరు రూరల్ : బైరెడ్డి నగర్‌లో గుడిసెల్లో నివాసం ఉంటున్న ప్రజలకు ఇళ్ల పట్టా లను పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు కోరారు. సోమవా రం స్పందన కార్యక్రమంలో మండల తహసీ ల్దార్ రాజశేఖర్‌బాబుకు సీపీఎం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడు తూ ఇళ్లు లేని నిరుపేదలకు బీఆర్‌ఆర్‌నగర్‌లో ని 589, 590, 595 సర్వే నంబలో 15 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారన్నారు. అర్హులైన వారిని గుర్తించి సర్వే నిర్వహించి వారికి పట్టా లు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు సాహిదాబీ, కాలనీవాసులు పాల్గొన్నారు.

వేతనాలు మంజూరు చేయాలి

ఆత్మకూరు: స్వచ్ఛ భారత్ కార్మికులకు వేతనాలు మంజూరు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, స్వాములు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం స్వచ్ఛ భారత్ కార్మికులు ధర్నా నిర్వహించారు. అంతకుమునుపు స్వచ్ఛ భారత్ కార్మికులు సీఐటీయూ కార్యాలయం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ గ్రామీణ పారిశుద్ధ్య కార్మికుల యూనియన్ నాయకులు స్వామిదాసు, వెంకటేశ్వర్లు, సుధాకర్, రవితేజ, వెంకటరమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోట నర్సన్న బావి సమీపాన సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాల బారినపడగా మరోకరి పరిస్థితి విషమంగా ఉంది. పడమర ప్రాతకోట గ్రామానికి చెందిన గంగి వెంకటరమణ, గంగి హరిప్రసాద్ బైక్‌పై నందికొట్కూరుకు బయలుదేరారు. అలాగే లక్ష్మాపురం గ్రామానికి చెందిన బుడగజంగాల బాలాంజనేయులు బైక్‌పై ప్రాతకోటకు బయలుదేరగా మార్గమధ్యంలో ఎదురెదురుగా వీరి బైకులు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో గంగి వెంకటరమణ కాలువిరగగా, గంగి హరిప్రసాద్ గాయాల బారినపడ్డారు. బాలాంజనేయులు పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

క్షుద్రపూజల కలకలం



క్షుద్రపూజల కోసం ముగ్గు వేసిన చోట దర్శనమిస్తున్న నిమ్మకాయలు

కొత్తపల్లి: మండలంలో సోమవారం క్షుద్రపూజలు కలకలం రేపాయి. మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామ సమీపంలో ఆత్మకూరు- సంగమేశ్వరం ప్రధాన రహదారిలోని బస్‌షెల్టర్ సమీపంలో పొలాలకు వెళ్లే మార్గంలో గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలకు పూనుకున్నట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం అటుగా పొలం పనులపై వెళ్లిన కొందరూ రైతులు చూసి భయభ్రాంతులకు గురయ్యారు. దారిలో పసుపు, కుంకుమలతో ముగ్గులువేసి, నిమ్మకాయలను ఉంచి, ఓ మహిళ దుస్తులను కూడా ఉంచి పూజలు జరిపినట్లు తెలుస్తుంది. తర్వాత చూస్తే పూజచేసిన ప్రాంతంలో నిమ్మకాయలు చెల్లాచెదురుచేసి, అక్కడ ఉన్న దుస్తువులను తీసుకువెళ్లి పక్కనే ఉన్న పంటకాల్వలో పడేశారని గ్రామస్తులు తెలిపారు.

ముచ్చుమర్రిని సందర్శించిన డీఎస్పీ



పర్యవేక్షక ఏఈ నాగలింగేశ్వరరెడ్డితో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పగిడ్యాల: మండల పరిధిలోని ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు సోమవారం సందర్శించారు. మంగళవారం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాజెక్ట్ సందర్శనకు విచ్చేయుచున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పర్యవేక్షక ఏఈ నాగలింగేశ్వరరెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జలవనరుల శాఖ అధికారులు ఇచ్చిన అనుమతి మేరకు లోపలికి పంపాలని, ఎక్కువ మందిని వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు. అలాగే వాహనాలు కూడా 30 వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని టీడీపీ శ్రేణులకు ముందుస్తుగానే తెలియజేయాలని రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి సూచించారు. ముఖ్యమైన సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తును నియమించాలని రూరల్ సీఐతో పాటు అర్బన్ సీఐ విజయ్‌భాస్కర్, ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జునలను ఆదేశించారు.

'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మండంలోని ఆయా గ్రామాల నుంచి భూమి ఆన్‌లైన్ సమస్యలపై, భూములకు చెందిన కొలత విషయమై, అర్జీలు వచ్చాయాని తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబధిత అధికారులకు ఆదేశంచామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరీ, ఏఓ మహేష్, ఏఈలు రామచంద్రయ్య, త్రిలింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో ప్రజలు సమస్యలను లిఖితపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు.

విద్యుత్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

శ్రీశైలంప్రాజెక్ట్: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించిన న్యాయమైన డిమాండ్లను కార్పొరేషన్, ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ సోమవారం మధ్యాహ్నం అంబేడ్కర్ సెంటర్‌లో ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు శ్రీదేవి, రామబ్రహ్మం, వెంకటేశ్వరరావు, మల్లికార్జున రావు, యోగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.